క్లుప్తంగా

వన్‌టౌన్ ఎస్‌ఐగా శ్రీనివాస్



ధర్మవరం అర్బన్: స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనంతపురం సీసీ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఉన్న ఎస్‌ఐ మహమ్మద్‌రఫి తిరుపతికి బదిలీపై వెళ్లారు. కొత్త ఎస్‌ఐ వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యంను మర్యాదపూర్వకంగా కలిశారు.

చికిత్స పొందుతూ వైఎస్సార్‌సీపీ నేత మృతి



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మక్బూల్ అహ్మద్

నల్లచెరువు: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత షేక్ గౌస్ (55) రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కదిరి సమన్వయ కర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ మృతుని నివాసం వద్దకు విచ్చేసి గౌస్ మృతదేహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉబిచర్లలో గురువారం జరిగిన గ్యాస్ పేలుడు ప్రమాదంలో దెబ్బతిన్న రెడ్డప్ప ఇంటిని పరిశీలించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథనాయుడు, కన్వీనర్ బట్టీ హైదర్ వలి, నాయకులు కల్లిపల్లి శ్రీనివాసులు, శ్రీధర్‌రెడ్డి, షెక్షావలిఖాన్, బావాఖాన్, రామాంజనేయులు, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ బికారిసాబ్ పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న రిటైర్డ్ జిల్లా జడ్జి శ్రీనివాస్ ఆంజనేయమూర్తి

ధర్మవరం అర్బన్: విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని రిటైర్డ్ జిల్లా జడ్జి వి.శ్రీనివాస్ ఆంజనేయమూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు వద్దనున్న సబ్‌స్టేషన్‌లో శుక్రవారం పట్టణం, రూరల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ప్రత్యేక విద్యుత్ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలను తీర్చేందుకే పరిష్కార వేదికను ఏర్పాటు చేశామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, ఇళ్లపైన విద్యుత్ వైర్లు, విద్యుత్ లైన్ మార్పులు తదితర సమస్యలను వినియోగదారులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఎస్‌ఏఓ బాలాజీ వెంకటేష్, ఏడీఈ నాగేంద్ర, ఏఏఓ రామకృష్ణ, ఏఈలు నాగభూషణ, కొండారెడ్డి, జానకి రామయ్య, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి

బత్తలపల్లి : అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, ఎంపీడీఓ శివనాగప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సమర్పించారు. ఈ సందర్భంగా దంపెట్ల సర్పంచు చల్లా కరుణాకరనాయుడు మాట్లాడుతూ స్థానిక ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇవ్వవద్దన్నారు. ముష్టూరు సర్పంచు గోపాల్, బత్తలపల్లి ఎంపీటీసీ సభ్యుడు కోటి నరేష్‌కుమార్ నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ సమావేశాలకు గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్ శివశంకర్‌నాయక్, వైస్ ఎంపీపీలు సాకే పార్వతి, గజ్జెల వెంగళరెడ్డి, గుర్రం శ్రీనివాస రెడ్డి, సర్పంచులు శారదమ్మ, గోపాల్, ప్రభాకర రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మంజుల, ఆంజనేయులు, నరేష్, రాములమ్మ, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, సీఎస్‌డీటీ శారద, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, మండల ఇంజనీర్ రమణయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పుట్టపర్తి టౌన్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి డిపో అధ్యక్షులు శివశంకర్ అధ్యక్షతన డిపో ఎదుట గేట్‌మీట్ నిర్వహించారు. కడప జోనల్ సెక్రటరీ శ్రీరాంనాయక్, జిల్లా కార్యదర్శి షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి వెల్లువలా చేరికలు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి 300 చేనేత కుటుంబాల చేరిక



ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన చేనేత కుటుంబాలు

ధర్మవరం: ఓటు బ్యాంకు రాజకీయాలతో చేనేతలను వాడుకున్న టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీలోకి వెల్లువలా చేరుతున్నారు. గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు గడ్డం రంగ ఆధ్వర్యంలో స్థానిక తిక్కస్వామి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 7వ వార్డు నుంచి 300మంది చేనేత కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. పార్టీలోకి చేరిన వారిలో చేనేత ప్రముఖుడు లింగం కృష్ణమూర్తితో పాటు కురుబ దుర్గమప్ప, అన్నం నాగరాజు, గడ్డం రామకృష్ణ, బుర్రా ఆదినారాయణ, బెల్లం హరినాథ్‌తో పాటు 300 కుటుంబాల వారు ఉన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేతల కష్టాలు తెలుసుకుని సంక్షేమం ఇతోధికంగా అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. చేనేతలకు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇంటిస్థలంతో పాటు మగ్గం షెడ్ నిర్మించుకునేందుకు వీలుగా 1.50 సెంట్ల స్థలంతో పాటు గృహం నిర్మించి ఇస్తున్నామన్నారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండు పర్యాయాలు ధర్మవరం పట్టణంలో 24 వేల మందికి పైగా ఇంటి పట్టాలను మంజూరు చేసి పేదల సొంతింటి కల సాకారం చేశామన్నారు. మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికి యేడాదికి రూ.24 వేల చొప్పున ఐదేళ్ల పాటు సాయం అందించామని గుర్తు చేశారు. టీడీపీ హయాంలో ఆత్మహత్యలు చేసుకున్న నేతన్నల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున సాయం అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రతి 30వేల జనాభాకు పట్టణంలో ఒక అర్బన్‌హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, మదర్ అండ్ చైల్డ్ ఆసుపత్రిని నిర్మించామని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, వార్డు కౌన్సిలర్ గడ్డం వరలక్ష్మి, నాయకులు గడ్డం రంగ, నీలూరిప్రకాష్, కోటిరెడ్డి బాలిరెడ్డి, చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, పెణుజూరు నాగరాజు, శంకర తేజ, సిద్ది రాజేష్, కాచర్ల అంజి, జేసీబీ రమణ, బ్రహ్మయ్య, చాంద్ బాష, అత్తార్ జిలాన్‌బాష, బడన్నపల్లి కేశవరెడ్డి, శంకర యుగందర్, మేడాపురం సూరీ, బీరే కేశవ, ఉడుముల రాము, తోపుదుర్తి వెంకటరాముడు, చెలిమి పెద్దన్న,కత్తె పెద్దన్న, జింకా కంబగిరి, డోలు సత్తి, మురళి,ఎస్పీ బాషా, రవీంద్రారెడ్డి, పెద్దిరెడ్డిగారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



హసీనాకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: కురుమాల గ్రామానికి చెందిన పాలెం నజీర్ బాషా(45) తొమ్మిది నెలల క్రితం ఉపాధి హామీ పనికి వెళ్లి వడదెబ్బతో మృతి చెందాడు. ప్రభుత్వం అతని కుటుంబానికి రూ.50 వేలు ఆర్థికసాయం మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన చెక్కును శుక్రవారం నల్లసింగయ్యగారిపల్లిలోని తన నివాసం వద్ద ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మృతుని భార్య హసీనాకు అందజేశారు. సర్పంచ్ లింగమూర్తి, డీలర్ జైనుల్లా, నాయకులు నరేష్‌కుమార్‌రెడ్డి, మునాఫ్ పాల్గొన్నారు.

ఫ్యాను గుర్తుకు ఓటేసి జగనన్నకు జైకొట్టండి



టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిన తిరుపాల్ నాయక్‌తో అపర్ణారెడ్డి తదితరులు

నల్లమాడ: వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి ప్రజలను కోరారు. వేళ్లమద్ది, కొత్తపల్లి తండాలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటా అందించారు. ఆయా గ్రామాల్లో ప్రచారానికి విశేష స్పందన లభించింది. యువత, మహిళలు పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొన్నారు. దుద్దుకుంట అపర్ణారెడ్డి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ప్రజల సమస్యలను సావధానంగా వింటూ పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కొండకింద తండాలో గిరిజన మహిళలతో కలిసి అపర్ణారెడ్డి నృత్యం చేశారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

నల్లమాడకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత పఠాన్ అబ్దుల్ రఫీ, కొండకింద తండాకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు డుంగావత్ తిరుపాల్‌నాయక్ వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ విభాగ కమిటీ జోనల్ ఇన్‌చార్జ్ డుంగావత్ రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అపర్ణారెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని సూచించారు.

రమేష్‌నాయక్‌కు సన్మానం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ విభాగ కమిటీ జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన అరవవాండ్లపల్లి తండాకు చెందిన యువ వ్యాపారి డుంగావత్ రమేష్‌నాయక్‌ను శుక్రవారం కొండక్రింద తాండాలో గిరిజనులు సన్మానించారు. ఈ సందర్భంగా తండాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దుద్దుకుంట అపర్ణారెడ్డి రమేష్‌నాయక్‌కు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. రమేష్‌నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి ఎస్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్‌గా తనను నియమించిన సీఎం వైఎస్ జగన్, ఇందుకు సహకరించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్‌లు ప్రమీలాబాయి, బొజ్జేనాయక్, ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, వ్యవసాయ సలహా బోర్డు చైర్మెన్ రఘునాథరెడ్డి, కుళ్లాయినాయక్, మంగేనాయక్, టీడీ విజయభాస్కర్‌రెడ్డి, సీతారాం, హరి, గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీనివాసులు, నారాయణస్వామినాయక్, భాస్కర్‌నాయక్, గణేనాయక్, రాంమోహన్, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదిరి ఎమ్మెల్యేతో మంత్రి పెద్దిరెడ్డి భేటీ



ఎమ్మెల్యే సిద్దారెడ్డితో భేటీ అయిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్రంలో మక్బూల్



మంత్రికి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ

కదిరి: వైఎస్సార్‌సీపీకి చెందిన కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డిని శుక్రవారం ఆయన స్వగృహంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కలిశారు. సుమారు అరగంట పాటు వారు పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కదిరిలో ముచ్చటగా మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేందుకు కలిసికట్టుగా పని చేయాలని మంత్రి పెద్దిరెడ్డి ఎమ్మెల్యేతో అన్నారు. సామాజిక సమీకరణల్లో భాగంగా కొన్ని చోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేక పోతున్నామని, ఆయితే పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తిస్తుందని మంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్ అహ్మద్, మాజీ మంత్రి మహమ్మద్ షాకీర్, మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, బత్తల వెంకటరమణ, జగదీశ్వరరెడ్డి తదితరులున్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన ఆలయ కమిటీ చైర్మన్

రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శుక్రవారం ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ కలిసి మంత్రికి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. రానున్న ఎన్నికల్లో కదిరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి ఆయనకు సూచించారు. నృసింహాలయ కమిటీ చైర్మన్‌గా వడ్డెర్లకు అవకాశం కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని మంత్రి పేర్కొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

ధర్మవరం అర్బన్ : పట్టణంలోని పీఆర్‌టీ సర్కిల్ వద్దనున్న పాత భవనం పైకప్పు పెచ్చులు కిందపడిన ఘటనలో ప్రమాదం తప్పింది. శుక్రవారం మధ్యాహ్నం పీఆర్‌టీ సర్కిల్ వద్దనున్న పాతభవనం పైకప్పు పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఆసమయంలో అక్కడ చిరువ్యాపారులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ముదిగుబ్బ: స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో మండలకేంద్రానికి చెందిన అరుణ, సంకేపల్లికి చెందిన బాబు, యాకర్లకుంటపల్లికి చెందిన నారాయణమ్మ గాయపడ్డారు. వీరిని 108లో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుతో నాణ్యమైన విద్యుత్



సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం రూరల్: విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణంతో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయొచ్చని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 28వ వార్డులో రూ.3.50 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణంతో కేతిరెడ్డి కాలనీ, ఇందిరమ్మ కాలనీ, యర్రగుంట సర్కిల్, టిడ్కో ఏరియా, వైఎస్సార్ కాలనీలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. చిన్నూరు, కేశవనగర్‌లో కొత్తగా సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రోజురోజుకు పట్టణం విస్తరిస్తుండడంతో భవిష్యత్ అవసరాల దృష్ట్యా రూ.5 కోట్లతో ఇండోర్ సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో రూ.400 కోట్లతో పలు సబ్‌స్టేషన్ల నిర్మాణాలను ఏర్పాటు చేసి రైతులు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, సరితాల బాషా, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

‘సిద్ధం’ బహిరంగ సభకు తరలిరండి



బత్తలపల్లిలో పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

బత్తలపల్లి: ఈ నెల 18న రాప్తాడులో జరిగే సిద్ధం బహిరంగసభకు ప్రజలు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులతో కలిసి సిద్ధం పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. సిద్ధం సభను వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజయవంతం చేయాలన్నారు. వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, సర్పంచులు చల్లా కరుణాకర్ నాయుడు, చెడిపోతుల గోపాల్, ఎంపీటీసీలు కోటి నరేష్‌కుమార్, తప్పేట ఆంజనేయులు, రైతు విభాగం మండలాధ్యక్షులు ప్రభాకరరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

‘సిద్ధం’ బహిరంగ సభ విజయవంతం చేద్దాం

రామగిరి: ఈనెల 18న రాప్తాడులో జరగనున్న సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేద్దామని పార్టీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చందు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం నసనకోట, మాదాపురం, పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీపల్లి పంచాయతీల్లోని గ్రామాల్లో పర్యటించారు. ఎంపీపీ మీనుగ నాగరాజు, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, సర్పంచులు రాజేష్, సిద్ధన్న, రామ్మూర్తి పాల్గొన్నారు.

తలుపుల: ఈ నెల 18న రాప్తాడులో తలపెట్టిన సిద్ధం సభను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సీనియర్ నాయకులు వివేకానందరెడ్డి, కుర్లి శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంత్యుత్సవాలు



రాయల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాపు సంఘం సభ్యులు

పుట్టపర్తి టౌన్: స్థానిక సాయి ఆరామంలో శుక్రవారం పుట్టపర్తి కాపు సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కాపు సంఘం నేతలు మాట్లాడుతూ రాయల పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. ప్రజల సౌకర్యార్థం ఆయన అనేక చెరువులు, కట్టడాలు కట్టించారని తెలిపారు. రాయలు కట్టించిన చెరువుల వద్ద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గంలో కాపు భవనం నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు చింతా దామోదర్, నాయకులు బొగ్గరం శ్రీనివాసులు, శ్రీరాములు, తోట్ల గంగాధర్, నాగరాజు, ముత్యాలు, మధు, మారుతీప్రసాద్, రామాంజనేయులు, ప్రతాప్, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: శ్రీకృష్ణదేవరాయలు జయంతి సందర్భంగా పట్టణ బలిజ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బైక్‌ర్యాలీ చేపట్టారు. పట్టణంలో ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి ఆర్టీసీ బస్టాండు, జీవిమాను సర్కిల్, చౌక్, కోనేరు మీదుగా ర్యాలీ సాగింది.

నల్లమాడ: మండల కేంద్రంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి బ్రెడ్డుముక్కలు పంచిపెట్టారు. నల్లమాడ మండల బలిజ సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షులుగా గడ్డం ఆదినారాయణ, అన్నం లక్ష్మినారాయణ, అధ్యక్షుడిగా మైలే రామచంద్ర, ఉపాధ్యక్షులుగా లక్ష్మన్న, వెంకటప్రసాద్, గంధోడి శ్రీరాములు, పూల శంకర్, సంగా మల్లికార్జున, సుంకు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శులుగా గడ్డం వెంకటరమణ, ఈటీ రామకృష్ణ, పసుపులేటి ఉత్తప్ప, కార్యదర్శులుగా పెద్ద చంద్ర, మల్లికార్జున, జితేంద్ర, కిష్టప్ప, మణికుమారి, కోశాధికారిగా మైలే శంకర ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ఎట్టకేలకు బడిలో చేరిన విద్యార్థిని




శివలక్ష్మికి జగనన్న విద్యా కానుక కిట్ అందిస్తున్న ఎంఈఓ సుధాకర్‌నాయక్

బత్తలపల్లి: ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాలు, ఎంపీపీ బగ్గిరి త్రివేణి చొరవతో ఎట్టకేలకు ఓ విద్యార్థినిని బడిలో చేర్పించారు. వివరాల్లోకి వెళ్లితే... తాడిమర్రి మండలం పెద్దకోట్లకు చెందిన యం.లక్ష్మినారాయణమ్మకు ఇద్దరు కుమార్తెలు శివలక్ష్మి(6), శాంతికుమారి(3) ఉన్నారు. ఈమె బత్తలపల్లి మండలం మాల్యవంతంలో ఉంటోంది. అంధత్వంతో బాధపడుతున్న ఆమెకు సదరం సర్టిఫికెట్ లేకపోవడంతో పింఛన్ రాలేదు. ఆడుక్కుంటూ వచ్చిన సంపాదనతో పిల్లలను పోషించుకుంటోంది. చిన్నారులకు ఆధార్‌కార్డు లేదన్న కారణంతో బడిలో చేర్చుకోలేదు. అయితే ఈ నెల 12న గ్రామంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహిస్తుండగా ఆమె పరిస్థితిని వైస్ ఎంపీపీ సాకే పార్వతి వివరించారు. దీంతో సమస్యపైన చొరవ చూపాలని ఎంపీపీ బగ్గిరి త్రివేణిని ఆదేశించారు. ఈ మేరకు ఎంపీపీ సూచనల మేరకు ఎంపీడీఓ శివనాగప్రసాద్ ఎంఈఓ సుధాకర్‌నాయక్ వెంటనే సీఆర్‌పి గోవిందరెడ్డిని మాల్యవంతంకు పంపి శివలక్ష్మిని బడిలో చేర్పించడంతోపాటు జగనన్న విద్యా కానుక కిట్‌ను అందించారు. మరో చిన్నారిని సైతం అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించేందుకు కృషి చేస్తామని ఐసీడీఎస్ అధికారులు ప్రకటించారు.

సంక్షిప్త సమాచారం

వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా నారాయణరెడ్డి



ధర్మవరం: వైఎస్సార్‌సీపీ సేవాదళ్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ముదిగుబ్బ మండలానికి చెందిన ఇందుకూరు నారాయణరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి ఇందుకూరు నారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ధర్మవరం: పట్టణంలోని యాదవ వీధికి చెందిన బత్రాజులు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి బత్రాజులు ఇంటికి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా నిచ్చారు. కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తంరెడ్డి, వడ్డే బాలాజీ, కొండ్రెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సచివాలయ ఉద్యోగి మృతి

కదిరి అర్బన్: కాళసముద్రం గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సురేంద్రచారి (42)శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈఓఆర్‌డీ అంజనప్పతో పాటు పలువురు సచివాలయ ఉద్యోగులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

‘గోవిందనాయక్‌తో ప్రాణహాని’

కదిరి టౌన్: మశానపేటకు చెందిన గోవిందనాయక్ నుంచి తనకు ప్రాణహాని ఉందని, అతనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని అదే కాలనీకి చెందిన పార్వతిబాయ్ శుక్రవారం విలేకరులతో వాపోయింది. 2022 డిసెంబర్ 6న తన కుమార్తె భూక్యా పద్మబాయ్‌ను అతి కిరాతంగా చంపిన వారిలో గోవిందనాయక్ ఒకరన్నారు. దీనిపై పోలీసులకు అప్పట్లో ఫిర్యాదు చేశామని, తన పలుకుబడితో కేసులో పేరు లేకుండా చేసుకున్నాడన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆంగ్ల ఉపాధ్యాయుడు గోరకాటి పెద్దారెడ్డిని పాఠశాల హెచ్‌ఎం బల్లా భాస్కర్‌తోపాటు ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ రూ.2.90 లక్షలతో ప్రధాన గేట్లకు సిమెంట్ ఫ్లాట్‌ఫారం వేయించిన ఉపాధ్యాయుడు గోరకాటి పెద్దారెడ్డిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గాండ్లపెంట: కటారుపల్లి శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కృష్ణవేణి తెలిపారు.

మానవ మనుగడకు చెట్లే ఆధారం



మొక్కలు నాటుతున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: మానవ మనుగడకు చెట్లే ఆధారమని, ప్రతి ఒక్కరూ చెట్లు నాటి సంరక్షించాలని పుట్టపర్తి అర్బన్ డీఎస్పీ వాసుదేవన్, గ్రీన్ భారత్ ఫౌండేషన్ చైర్మన్ శంకరనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం, పోలీస్ క్వార్టర్స్‌లో మొక్కలు నాటారు. జిల్లాలోని ప్రతి పోలీస్ కార్యాలయం, డివిజన్ కార్యాలయాల వద్ద మొక్కలు నాటి స్టేషన్లను నందనవనాలుగా తీర్చి దిద్దుతామన్నారు. ఎంఈఓ ప్రసాద్, వెంకటరత్నం ఉన్నారు.

వలంటీర్లకు ఘన సన్మానం



వలంటీర్లను సన్మానించిన దృశ్యం

తలుపుల: స్థానిక వైకేపీ ఏకార్యాలయంలో ఎంపీపీ రఫినాయక్ అధ్యక్షతన వలంటీర్లకు వందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వలంటీర్ల సేవలను గుర్తించి వజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులతో సత్కరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ టోపి రమణ, ఈఓఆర్డీ శకుంతల, సర్పంచులు కొండారెడ్డి, సుగుణమ్మ, మల్లినాయుడు, దివాన్‌వలి, కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్‌పీర పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కనగానపల్లి: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని పలువురు రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ రమాదేవి వద్ద బైండోవర్ చేయించారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

పుట్టపర్తి టౌన్: విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి పేర్కొన్నారు. శుక్రవారం సత్యసాయి బాబా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ ఆలయంలో విద్యార్థులు, సీనియర్ సిటిజన్లతో సూర్యనమస్కారాలు చేయించారు. విశ్రాంత రెవిన్యూ అధికారి అశోక్‌గుప్తా, రిటైర్డ్ తహసీల్దార్ నాగార్జునసెట్టి, శంకరనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల్లో ‘జగనన్న ఆరోగ్య సురక్ష’

గాండ్లపెంట: మలమీదపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్య వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 373 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ బాబాఫక్రుద్దీన్ తెలిపారు. స్పెషలిస్ట్ డాక్టర్లు అర్షియాపర్వీన్ (గైనకాలజిస్ట్), కంటి వైద్య నిపుణులు డాక్టర్ గురులక్ష్మీదేవి, స్థానిక డాక్టర్ రోజా, ఎంపీడీఓ రామనాయక్, సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: రామాపురం గ్రామ సచివాలయంలో శుక్రవారం సర్పంచు బండి సరస్వతి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈఓఆర్డీ దివాకర్, ఎంపీటీసీ సభ్యురాలు బండి రాములమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి వీరనారప్ప తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: ఎం.అగ్రహారం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు గోవర్ధన్ నాయుడు, హరిత గైనకాలజిస్టు కిశోరి, జనరల్ ఫిజీషియన్ నవీన్‌కుమార్‌లతో రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. సర్పంచులు రోజారమణి, ఆఫ్తాలమిక్ అధికారి సికందర్, సీహెచ్ఓ హేమలత, వెంకటనారాయణరెడ్డి, ఎంపీహెచ్ఈఓలు నారాయణమ్మ, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.